# పంకజం పశ్చాత్తాపం

**కస్తూరి నయనతార**




"ట్రింగ్...ట్రింగ్" అంటూ అలారం మ్రోగింది. అది వినబడుతూనే "అబ్బ....అప్పుడే అయిదైందా! ఇప్పుడే లేవాలా? కళ్లు మూసుకుపోతున్నాయి. అస్సలు లేవాలనిపించడం లేదు ఈ రోజెందుకో" బద్ధకంగా అనుకుంది పంకజం. మనసు లేవమంటున్నా శరీరం మాట వినడం లేదు. పంకజానికి తన జీవితం మీద తనకే విసుగు పుట్టింది.

'ఒక్క రోజు కూడా నా పనికి సెలవు ఉండదు. అందరికీ ఆదివారమైనా సెలవు దినం ఉంటుంది. కానీ ఆడదానికి ఆదివారం కూడా సెలవు కాదు. ఆ రోజు కూడా రోజులాగే పెందరాళే లేవాలి. ఫలహారాలు, వంటలు చేయాలి. సాధారణంగా పనిమనిషి ఆదివారాలు ఏదో వంకతో మానేస్తుంది. నాకు మాత్రం ఆదివారం సెలవు కాకపోగా ఓవర్‌టైమ్ కూడా ఉంటుంది' అనుకుంది విసుగ్గా.

ఆదివారాలు ఫలహారాల్లోకి భోజనాల్లోకి కుటుంబ సభ్యులందరూ 'స్పెషల్స్' కోరుకుంటారు. ప్రత్యేక వంటలు అంటే మరి పంకజానికి అధిక పనే.

'సెలవురోజు కాబట్టి అదే ఊళ్లో ఉండే బావగారి కుటుంబమో ఆడపడుచు కుటుంబమో, లేక వేరే చుట్టాలో హాజరు వేయించుకునే వెళ్తారు. వచ్చిన వాళ్లంతా అత్తమామల వైపు వాళ్లవటంతో వాళ్లకి భోజనాలో, ఫలహారాలో ఏర్పాటు చేయవలసే ఉంటుంది..' పాలబ్బాయి తలుపు కొట్టడంతో పంకజం తన ఆలోచనలకు ఫుల్‌స్టాప్ పెట్టి, లేచి చకచక పనులు ప్రారంభించి, వరుసగా ఒకదాని తర్వాత ఒకటి చాలా నేర్పుగా చేసుకుంటూపోతోంది.

పంకజం నడివయసులో ఉన్న మధ్య తరగతి ఇల్లాలు. భర్త విశ్వానాథానికి 'ఏదో ఫర్వాలేదులే' అనుకునే ఉద్యోగం, ఇంజినీరింగ్ రెండో ఏడాది చదువుతున్న కొడుకు రాజేష్, ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతున్న కూతురు సౌమ్య ఉన్నారు. పంకజం అత్తమామలు కూడా వాళ్లతోటే ఉంటారు. ఎందుకంటే వారికి ఇంకా కొడుకులు ఉన్నా, ఆ కోడళ్లు ఉద్యోగస్తులు కావడంతో పెద్ద వయసులో ఉన్న అత్తమామలని చూడటానికి వాళ్లకి కుదరదు. ఆదివారాలు వచ్చి చూడటానికి మాత్రమే వాళ్లకి వీలు అవుతుంది.

విశ్వనాథం ఉదయం ఎనిమిది గంటలకల్లా బయలుదేరి వెళ్లి, రాత్రి ఎనిమిది గంటలకు ఇల్లు చేరతాడు. కొడుకు రాజేష్, కూతురు సౌమ్య కాలేజీలు దూరం కావడం వలన పొద్దుటే 7.30కల్లా బయలుదేరి వెళ్తారు. పొద్దుటే లేచి, స్నానకృత్యాలు ముగించుకుని, వీళ్లకి ఇంట్లో తినడానికి ఫలహారం, మధ్యాహ్నం తినడానికి డబ్బాల్లోకి చపాతీ కూర చేసి పెట్టాలి పంకజం.

"అమ్మా! ఈ రోజు బ్రేక్‌ఫాస్ట్‌లోకి ఏం చేశావ్?" సౌమ్య అడిగింది.

"ఇడ్లీ, గరమ్‌గరమ్ సాంబార్‌కే సాతి!" నోరూరించేట్లుగా చెప్పింది పంకజం.

"అబ్బ! మళ్లీ ఇడ్లీనా? నిన్ననే కదమ్మా ఇడ్లీ చేశావ్? మళ్లీ ఈ రోజు కూడా ఇడ్లీయేనా? నాకేం అక్కర్లేదు!" విసుక్కుంది సౌమ్య.

"ఈ రోజుకి తినమ్మా! నా బంగారు తల్లివి కదూ! నీకిష్టమని సాంబారు చేశాను. రేపు నీకిష్టమైన రవ్వదోసలేస్తాను. ఈ రోజుకి ఇడ్లీ తినమ్మా!" పంకజం బ్రతిమాలింది.

"సరేలే అమ్మా! నువ్వెప్పుడూ ఇంతే!" అయిష్టంగా ఒప్పుకుంది.

'అమ్మయ్య, బతికించావు తల్లీ ఈ పూటకి!' ఊపిరి పీల్చుకుంది పంకజం. అత్తమామలు రోజూ ఉదయం ఇడ్లీ మాత్రమే తీసుకుంటారు, వేరేవి వాళ్ల ఆరోగ్యానికి అంత మంచిది కాదని, అందుకని రోజూ ప్రొద్దున్న వాళ్లకి ఇడ్లీలే వేయాలి. పిల్లలూ భర్త ఇదిగో ఇలాగే రోజూ ఇడ్లీలే తినాలా అని విసుక్కోవడం వలన వాళ్లకి రోజూ మార్చి మార్చి ఏమైనా చేయాలి.

"అమ్మాయీ! మీ మామగారు పళ్లుతోమడం అయింది. కాస్త ప్రోటినెక్స్ ఇద్దూ తొందరగా" అత్తగారి పురమాయింపు విని...

"ఆ.. ఆ.. వస్తున్నా. ఒక్క నిమిషం అత్తయ్యగారూ!" సమాధానం పూర్తి అయ్యేలోగానే ప్రోటినెక్స్ గ్లాసు టేబుల్ మీద ప్రత్యక్షమైంది.

"ఆ చేత్తోనే నాకూ మళ్లీ ఇంకో అరకప్పు కాఫీ తెద్దూ. ఈరోజు కాఫీ చాలా బాగుంది" అన్న అత్తగారికి గబగబ కాఫీ కలిపి ఇచ్చి, పిల్లలకి పాలు ఇచ్చింది.


రోజూ భర్తకి, పిల్లలకి డబ్బాల్లోకి తయారుచేసి, తినడానికి టిఫిన్ పెట్టి, అత్తమామల కాఫీ, టిఫిన్ల సంగతి చూసి, ఒక అరగంట సేపు పూజ చేసుకుంటుంది. ఆపై వంట ప్రయత్నం చేస్తూ, అత్తమామలకు రోజూ ఏదో ఒక పళ్లరసం చేసి ఇస్తుంది. వంట పూర్తి చేసి, వాళ్లకి అన్నాలు పెట్టి, తను తిని, అన్నీ సర్దుకునేటప్పటికి మధ్యాహ్నం రెండు గంటలవుతుంది. వళ్లు హూనమై నిద్ర వస్తూ ఉంటుంది. కానీ సాయంకాలం టీతో పాటు తినడానికి చిరుతిళ్లు తయారుచేసుకోవడం, ఆకుకూరలు ఉంటే వలుచుకుని ఉంచుకోవడం, రాత్రికి ఏమి చేయాలో చూసుకోవడం... ఇదీ పంకజం మధ్యాహ్న దినచర్య. టీ తర్వాత పిల్లలు, భర్త ఒకళ్ల తర్వాత ఒకళ్లు ఇంటికి రావడం, రాగానే సేద తీరడానికి వాళ్లకి ఏదైనా ఇవ్వడం, రాత్రికి వంట చేసుకోవడంతో సమయం ఇట్టే గడిచిపోతుంది. ఒక చెంబుడు నీళ్లు వంటి మీద గుమ్మరించుకుని, ఏదో స్నానం అయిందనిపించుకుని, మళ్లీ వరుసగా అందరికీ భోజనాలు పెట్టి, ఇల్లు సర్దుకుని, మరుసటిరోజుకి ఇడ్లీకి పప్పు రుబ్బుకుని, పంకజం పక్క చేరేటప్పటికి రాత్రి పది గంటలవుతుంది.

ఏ మార్పూ లేకుండా కొన్ని సంవత్సరాల నుండి పంకజానికి ఇదే దినచర్య కొనసాగుతోంది. ఎక్కువగా అలసిపోవడం వలన రాత్రిళ్లు కూడా సరిగ్గా నిద్ర పట్టదు పంకజానికి. నిద్రపట్టక ఆలోచిస్తూ, వెనక్కి చూసుకుంటే ఈ పనులు తప్ప ఇంక ఏమీ కనపడదు. ఒక్కరోజు కూడా హాయిగా కూర్చుని, విశ్రాంతిగా ఒక కప్పు కాఫీ తాగింది లేదు.

'పెళ్లయినప్పటి నుండి ఇంతే! నా జీవితంలో ఏ మార్పూ లేదు. రాదేమో కూడానూ. అత్తగారి చేతి కాఫీ ఒక్క పూటైనా తాగిన గుర్తు లేదు' అనుకుంటూ వాపోతూ ఉంటుంది పంకజం అప్పుడప్పుడు.

పంకజం కోడలిగా వచ్చే నాటికే మామగారు రిటైర్ అయిపోవడం వలన వాళ్లు పంకజం వాళ్లతోనే ఉండేవారు పెళ్లైన కొత్తల్లోనే. తండ్రి పోవడం వలన పుట్టింటి ఆసరా కూడా పెద్దగా లేదు పంకజానికి. ఎప్పుడైనా తల్లితో గడపటానికి అన్నదమ్ములిళ్లకు వెళ్లినా పొద్దుటే లేవడం అలవాటైన పంకజం ఎవరూ లేవకముందే లేచి పోయి, కాఫీ డికాక్షన్ తీసేసి పాలు కాచి, తన కాఫీ తనే

కలుపుకుని తాగేది. పనిచేసే చేయి ఊరుకోలేక వంట పని కూడా మీద వేసుకుని, ఏదో ఒకటి చేస్తూనే ఉండేది. పిల్లలు పెద్దవాళ్లయ్యాక అన్నదమ్ములిళ్లకు కూడా వెళ్లడం పడటం లేదు. ఇదే విధంగా కొన్నేళ్లుగా సాగుతుండటంతో ఓపిక చచ్చిపోయి, పంకజానికి విసుగు పుట్టేసి అప్పుడప్పుడు 'ఎవరికీ కనిపించకుండా ఎటో వెళ్లిపోయి కనీసం ఓ మూడు రోజులైనా మంచం దిగకుండా పడుకుంటే కాఫీ, టిఫిన్, భోజనం అన్నీ మంచం దగ్గరికే ఎవరైనా తెచ్చిస్తే ఎంత బాగుంటుంది! ఎప్పటికైనా నా ఈ కోరిక తీరుతుందా?' అని ఆశపడుతూ ఉంటుంది. ఎందుకో తెలీదు కానీ ఈమధ్య పంకజం రోజుకి పదిసార్లైనా అలా కోరుకుంటోంది.



పంకజం ఒక రోజు రాత్రి పడుకుంటూ "అబ్బ! కాళ్లు రెండూ లాగేస్తున్నాయి. నడుం కూడా తిప్పలేకపోతున్నా. ఈ రోజు పని మరీ ఎక్కువైపోయింది. నేనిక చేయలేను బాబూ, ఇంత పనీ!" అంది నీరసంగా భర్త విశ్వనాథంతో.

ఏదో పుస్తకం చదవడంలో లీనమైపోయిన విశ్వనాథం- "ఏమిటే నీ సణుగుడు?" అని విసుక్కున్నాడు.

"అంతే మీరు. నా గోడెప్పుడూ పట్టదు మీకు! ఇంటెడు చాకిరీ చేయడం ఇక నా వల్ల కాదు. నాకూ బ్రేక్ కావాలి!" నొక్కి చెప్పింది పంకజం.

"అబ్బ. నువ్వొక్కర్తివే పెద్ద కష్టపడిపోతున్నట్లు మాట్లాడుతున్నావే!" కసురుకుని మళ్లీ పుస్తకం చదవడంలో మునిగిపోయాడు విశ్వనాథం.

"మీతో చెప్పడం నా బుద్ధి తక్కువతనం!" అనుకుంటూ నిద్రలోకి జారిపోయింది.

మరునాడు అలారం మోగక ముందే పంకజం దిగ్గున లేచి కూర్చుంది. విపరీతమైన కడుపునెప్పి కుదిపి మరీ లేపింది. నెప్పి అంతకంతకూ ఎక్కువైపోయి పంకజం విలవిల్లాడిపోతోంది. విశ్వనాథం, పిల్లలు కంగారు పడి, హాస్పిటల్‌కి తీసుకుని వెళ్లడం, డాక్టర్ చూసి అపెండిసైటిస్ ఏమో అని అనుమానించి, అడ్మిట్ చేసుకోవడం, అన్ని పరీక్షలు చేసి ఏవో మందులు పంకజం శరీరంలోకి ఎక్కించడం అన్నీ టకటకా జరిగిపోయాయి. నెప్పి తగ్గుముఖం పట్టింది. అయినా డాక్టర్ "రెండు మూడు రోజులు హాస్పిటల్లోనే ఉండాలి. అబ్జర్వ్ చేయాలి. మళ్లీ నెప్పి వస్తే ఆపరేషన్ చేయాల్సి రావచ్చు" అని చెప్పాడు.

పంకజం కళ్లు తెరిచి, నిస్త్రాణగా చూసింది. పిల్లలు, భర్త బిక్కమొఖాలు వేసుకుని చూస్తున్నారు. పంకజానికి జాలి వేసింది. మళ్లీ నిద్రలోకి జారుకుంది.

రెండు రోజులు గడిచాయి. ఈ రెండు రోజులు పంకజం హాస్పిటల్ రూమ్‌లో ఉండటం వలన బాత్రూమ్‌కి తప్పితే మంచం దిగలేదు. మంచి ఆహారాన్ని ఆసుపత్రి వారే వేళకి తెచ్చి, నవ్వుతూ తినిపిస్తున్నారు. మంచం మీదే కూర్చుని తింటోంది. ఒకరోజు గడవగానే పంకజానికి విసుగుపుట్టింది.

'అబ్బ! ఖాళీగా ఇలా మంచం మీదే పడుకుని ఉండటం చాలా కష్టం. అక్కడ పాపం ఇంట్లో వాళ్లు ఏమి తింటున్నారో? అత్తమామా? వేళకి అన్నీ ఇస్తున్నారో లేదో? రోజూ చక్కగా పొద్దున్నే లేచి, బొంగరంలా తిరుగుతూ అన్నీ చకచకా చేసుకునేదాన్ని. నేనిక్కడిలా పడుకుని ఉన్నా అక్కడ పనమ్మాయి వచ్చిందో లేదో? పిల్లలు అన్నీ ఎక్కడ పడితే అక్కడ పడేస్తారు. ఆ పనిపిల్ల ఏమి పట్టుకుపోతుందో ఏమో? తలుపులు సరిగ్గా వేసుకుంటున్నారో లేదో? వాళ్లు ఏమి తింటున్నారో?' మొదలైన సందేహాలతో తనింట్లో లేనప్పుడు తనిల్లు, తన వాళ్లు ఏమై పోతున్నారోనని ఒకటే తపన పంకజంలో.

హాస్పిటల్లోని ఏ.సి, టీవీ, ఫ్రిజ్ మొదలైన అన్ని హంగులతో కూడిన ప్రత్యేక గదిలో ఉన్నా ఏమాత్రం ఊరట కలుగలేదు పంకజానికి.

'తొందరగా తనని డిశ్చార్జి చేసేస్తే, తనింటికి తను పోతుంది. ఈ హాస్పిటల్లో నేనుండలేను బాబూ! నా ఇంటికి నేను పోయి కాళ్లు, చేతులు టకటకలాడిస్తూ పని చేసుకుంటుంటేనే హాయి! ఇలా కాళ్లు, చేతులు కట్టేసినట్లు తను పడుండ లేదు దేవుడా! మళ్లీ నేను నా పనులన్నీ చేసుకునేలా చూడు. నాకెలాంటి 'బ్రేక్' అక్కర్లేదు. ఆ కష్టంలోనే ఎంతో తృప్తి ఉంది. పని నుండి విశ్రాంతి కావాలని కోరుకున్నందుకు లెంపలేసుకుంటున్నా తండ్రీ! తొందరగా నా ఇంటికి నన్ను పంపేయి!' అనుకుంటూ పంకజం లెంపలేసుకుంది.